క్లుప్తంగా

చేనేత హస్తకళలను ప్రోత్సహించండి



చేనేత హస్తకళా ప్రదర్శనను తిలకిస్తున్న ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ మహేష్

సత్తుపల్లిరూరల్: చేనేత హస్త కళలను అందరు ప్రోత్సహించాలని మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఆర్టీసీ డీఎం యు.రాజ్యలక్ష్మి అన్నారు. సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఆలిండియా క్రాఫ్ట్‌బజార్ హస్త కళా ప్రదర్శనను ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, కౌన్సిలర్ ఎస్‌కే ఛాంద్‌పాషా, క్రాఫ్ట్ బజార్ నిర్వాహకులు మహమ్మద్ నసీమ్, రాజ్‌కుమార్, సతీష్, మహేష్, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన మధిర ఎంపీడీఓ

మధిర: మధిర మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సిలార్ సాహెబ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు మధిర ఎంపీడీఓగా పనిచేసిన కుడుముల విజయభాస్కర్ రెడ్డి కామేపల్లికి బదిలీ కాగా, ఆయన స్థానంలో కామేపల్లి ఎంపీడీఓగా పని చేస్తున్న సిలార్ సాహెబ్ మధిరకి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధుల సహకారంతో, అధికారులు, సిబ్బంది సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

కారేపల్లి మండల రైతుబంధు కన్వీనర్‌గా ఈసాల



ఈసాల నాగేశ్వరరావు

కారేపల్లి : కారేపల్లి రైతుబంధు మండల కన్వీనర్‌గా ఎర్రబోడు కోయ గుంపుకు చెందిన ఈసాల నాగేశ్వరరావు నియమితులైయ్యారు. దీనికి సంబంధించి ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ శుక్రవారం నియామక ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు వీరన్న, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉమాశంకర్, భన్సీలాల్, ప్రముఖ న్యాయవాది శ్రీనివాసరావు, ముత్యాల సత్యనారాయణలు హర్షం వ్యక్తం చేశారు.

చలివేంద్రం ప్రారంభం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని బిందు ఆటోమొబైల్‌షాపు పక్కన ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూలింగ్ మినరల్ వాటర్ చలివేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ సర్కిల్ నిర్వాహకులు ఎస్‌కే కరీముల్లా(బాబు), ఎస్‌కే సుభాని, ఎస్‌కే గౌస్, ఎస్‌కే పాషా, మొరిశెట్టి సాంబశివరావు, గట్టం శ్రీనివాసరావు, మహదేవ సురేష్, కౌన్సిలర్లు మట్టా ప్రసాద్, ఛాంద్‌పాషా, అద్దంకి అనీల్, తోట రమేష్, ప్రవీణ్, అంకమరాజు, నరసింహారావు, శ్రీను పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ఔదార్యం



ఖమ్మం ఆస్పత్రిలో నగదు అందిస్తున్న ఆటో యూనియన్ సభ్యులు

ముదిగొండ: మండలంలోని గోకినేపల్లికి చెందిన తోటమల్ల రవీందర్ అనారోగ్యంతో బాధపడుతూ ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆటో యూనియన్ సభ్యులు అందరు కలిసి రూ.60,600 ను సేకరించి ఆ నగదును రవీందర్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



నారాయణపురంలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రుపాలెం: మండలంలోని రేమిడిచర్ల, నారాయణపురం గ్రామాల్లో శుక్రవారం రాత్రి హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి కర పత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ వైస్ చైర్మన్ కడియం శ్రీనివాసరావు, సర్పంచ్ బూసిపల్లి వెంకటరెడ్డిలు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగిరెడ్డి శ్రీనివాసరావు, వెంకటరత్నం, బాబురావు, అనీల్‌కుమార్, వెంకటనర్సయ్య, బోస్, పూర్ణ, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్డును బాగు చేయరా..?

- అస్తవ్యస్తంగా ఎర్రుపాలెం – జయంతి రోడ్డు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న ప్రజలు



రోడ్డుపైకి వచ్చిన ముళ్లకంప



గుంతలమయంగా మారిన ఎర్రుపాలెం - జయంతి రోడ్డు

ఎర్రుపాలెం : మండలకేంద్రం నుంచి జయంతి గ్రామం వెళ్లే బీటీ రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. అడుగడుగున గుంతలు ఏర్పడ్డాయి. ఇది బీటీ రోడ్డా..? లేక మట్టి రోడ్డా అనే అనుమానాలు కలుగుతున్నాయి. మండలకేంద్రంలోని రింగ్ సెంటర్ నుంచి ఈ రహదారి 2కి.మీ దూరం వరకు ఉంటుంది. తెలంగాణా – ఆంధ్రా సరిహద్దులోని ఈ రోడ్డు అర కిలోమీటర్ మేరకు తెలంగాణా రాష్ట్ర పరిధిలో ఉండగా అక్కడ నుంచి ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలంలో ఉంది. తెలంగాణా – ఆంధ్రా ప్రజలను కలిపే రోడ్డు అధ్వానంగా మారడంతో పాటు పక్కన ముళ్ల కంపలు ఉండటంతో ప్రయాణికుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

మరమ్మతులు చేయాలి..

ఎర్రుపాలెం మండల ప్రజలకు ఏపీ సరిహద్దు గ్రామాలతో వ్యాపార, సామాజిక సంబంధాలు బాగున్నాయి. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. రెండు దశాబ్దాల క్రితమే ఈ రోడ్డు నిర్మించగా ఒక్కసారి కూడా మరమ్మతులు చేసిన పాపాన పోలేదు. ఎర్రుపాలెం నుంచి ఏపీ సరిహద్దు వరకు, అక్కడ నుంచి జయంతి వరకు కూడా లోతైన గుంతలున్నాయి. బీటీ పూర్తిగా పోయి రాళ్లు లేచి దర్శనమిస్తున్నాయి. మరమ్మతులకు నోచుకోక ఈ దారుల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ముళ్లకంప కూడా దట్టంగా పెరిగింది. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ధ్వంసమైన ఈ దారులపై వెళ్తే అదుపుతప్పి కింద పడటం ఖాయమని ద్విచక్ర వాహదారులు వాపోతున్నారు.

నిధులు మంజూరు చేయాలి..

పలుమార్లు ఇటు తెలంగాణ పాలకులకు, అటు ఏపీ పాలకులకు ప్రజలు రోడ్డు బాగు చేయాలని వినతులు అందజేశారు. పలు సమావేశాలకు వచ్చిన ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నారు. ఇటీవల ఎర్రుపాలెంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రత్యేక సమావేశానికి హాజరైన పాఠశాల పూర్వ విద్యార్థి, ఏపీ రాష్ట్రం బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌కు స్థానిక జెడ్పీటీసీ శీలం కవిత కూడా రోడ్డు బాగు చేసేందుకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించి ఎంపీ సురేష్ నిధుల మంజూరుకు హామీ ఇచ్చారు. ఇప్పటికైనా తెలంగాణ, ఏపీలకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు తమ తమ పరిధిలోని ఈ రోడ్డు మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పెద్ద పెద్ద గుంతలున్నాయి..



ఎర్రుపాలెం టూ జయంతి రోడ్డులో పెద్ద పెద్ద గుంతలున్నాయి. ధ్వంసమైన ఈ రోడ్డును బాగుచేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నా పట్టించుకోవడం లేదు. గుంతలమయంగా మారిన రోడ్డుపై ద్విచక్ర వాహనదారులు స్కిడ్ అయి ప్రమాదాలకు గురవుతున్నాం.

– గంధం రాధాకృష్ణ, ఎర్రుపాలెం

పాలకులు నిర్లక్ష్యాన్ని వీడాలి..



రోడ్డు మరమ్మతులకు నిధులు విడుదల చేసే విషయంలో పాలకులు నిర్లక్ష్యాన్ని వీడాలి. పలుమార్లు ఈ రహదారిపై వాహనదారులకు ప్రమాదాలు సంభవించినా సంఘటనలు చాలానే ఉన్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలి.

– వేమా నాగబాబు, ఎర్రుపాలెం

ప్రభుత్వానికి నివేదించాం..



రోడ్డు మరమ్మతులకు గురైన మాట వాస్తవమే.. రోడ్డు మరమ్మతుల విషయమై నిధులు మంజూరు చేయాలని ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటా.

– నరేష్, పీఆర్ శాఖ ఏఈ, ఎర్రుపాలెం

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



మధిర: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్ రాజ్

మధిర : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజ్ కోరారు. శుక్రవారం మధిర మార్కెట్ యార్డులో మధిర సొసైటీ చైర్మన్ బిక్కి కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరుగాలం రైతులు కష్టపడి పండించిన పంటలను రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షుడు రావూరి శ్రీనివాసరావు, కరివేద సుధాకర్ తదితరులు ఉన్నారు.

మొక్కజొన్నలు..

బోనకల్: మండలంలోని లక్ష్మీపురం సొసైటీలో శుక్రవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ మాదినేని వీరభద్రరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర లభించేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. క్వింటా మక్కలకు రూ.1,962 గిట్టుబాటు ధర కల్పిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తుళ్లూరు రమేష్, సర్పంచ్ కారంగుల చంద్రయ్య, సీఈఓ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం 'కంటి వెలుగు'



సత్తుపల్లిరూరల్: కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు

బోనకల్/సత్తుపల్లిరూరల్: దేశానికే కంటి వెలుగు ఆదర్శమని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, సర్పంచ్ లలిత అన్నారు. బోనకల్ మండలంలోని ముష్టికుంట్ల రైతు వేదికలో, సత్తుపల్లిలోని చెరుకుపల్లి గ్రామంలో కంటి వెలుగు వైద్య శిబిరాలను జెడ్పీ చైర్మన్, సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల కళ్లల్లో ఆనందం నింపడం కోసమే కంటి వెలుగు పథకం ప్రవేశపెట్టినట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ఈ శిబిరంలో వైద్యులు అందుబాటులో ఉండి అవసరమైన వారికి కంటి అద్దాలను అందిస్తారన్నారు. శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి స్రవంతి, ఎంపీపీ కంకణాల సౌభాగ్యం, ఎంపీడీఓ వేణుమాదవ్, నాయకులు బందం శ్రీను, షేక్ హుస్సేన్, బందం నాగేశ్వరరావు, దొప్ప కృష్ణ, గంగారం పీహెచ్‌సీ వైద్యులు అవినాష్, జానీపాషా, హెచ్ఎస్ నరసింహారావు, ఏఎన్ఎం హైమావతి, పార్వతి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోవాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కల్లూరు: కల్లూరులో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని పీసీసీ సభ్యుడు బైరెడ్డి మనోహర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మండల కమిటీ పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన రైతుల ధాన్యం చేతికొచ్చే సమయానికి వర్షాలు పడడంతో రైతుల ఆశలన్నీ అడియాసలు అయినాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలు మొక్కుబడికే తప్ప రైతులకు ఒరిగిందేమి లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులపై కపట ప్రేమ చూపిస్తుందన్నారు. 15 రోజులుగా కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని వాపోయారు. వీరితో పాటుగా మొక్కజొన్న, మిరప, మామిడి రైతులకు కూడా నష్టపరిహారం అందించి ఆదుకోవాలన్నారు. రైతులకు న్యాయం జరగకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ డిపార్ట్‌మెంట్ కన్వీనర్ కిరణ్‌కుమార్, పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ లక్ష్మణరావు, గోపాలస్వామి, పుల్లారావు, జనార్దన్, కృష్ణ, భాస్కర్‌రావు, కృష్ణ, ప్రసాద్, నరేంద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధ్యాన్యాన్ని కొనుగోలు చేయాలి..

కల్లూరు రూరల్: మండలంలోని మగ్గ వెంకటాపురంలో కాంగ్రెస్ కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు శీలం బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రైతులు ఆరబోసిన ధాన్యం రాశులను పరిశీలించారు. కాంగ్రెస్ నాయకులు నర్సింహరెడ్డి, వెంకటకృష్ణ, కృష్ణ, వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

మిల్లులకు తరలించాలి



కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీపీ ఏపీడీ రావుల జయశ్రీ

కల్లూరు రూరల్: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కాటా వేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన మిల్లులకు తరలించాలని డీఆర్‌డీపీ ఏపీడీ రావుల జయశ్రీ ఆదేశించారు. శుక్రవారం కల్లూరు మండలంలోని పుల్లయ్య బంజరు, లక్ష్మీపురం, కొర్లగూడెం, బత్తులపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఐకేపీ కొనుగోలు కమిటీ సభ్యులు, రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడుతున్న ఇబ్బందులు, రవాణా, మిల్లుల కేటాయింపు తదితర విషయాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం వెంకటరామారావు, సీసీ వెంకటరావమ్మ, వ్యవసాయ విస్తరణ అధికారులు దీపిక, వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

నాలుగో రోజుకు చేరిన నిరాహార దీక్షలు



దీక్షలో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకుడు వెంకటేశ్వరరావు

సత్తుపల్లిరూరల్: దళిత బంధు పథకంలో అవినీతిని వ్యతిరేకిస్తూ ఎంఎస్పీ, ఎమ్మార్పిఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. దళితులకు ఏ పథకాలు ప్రవేశ పెట్టినా సక్రమంగా అందించేది లేదని.. ఉచితాలలో కూడా అవినీతికి పాల్పడే అరాచకపు పాలన సాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ, ఎమ్మార్పిఎస్ నాయకులు జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు, తగరం మరియమ్మ, తిరుపతమ్మ, లేయమ్మ, సుగుణమ్మ, మరకాల మోసియ, గోళ్ల మూడి శ్రీనివాసరావు, పరిగడుపు లక్ష్మణ్, తాళ్ల అర్జున్, గంధం రాఘవ, కోట ప్రసాద్, గోల్లమండల ముత్తారావు పాల్గొన్నారు.

7న టీడీపీ మినీ మహానాడు



సత్తుపల్లిటౌన్: సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

సత్తుపల్లిటౌన్/కొణిజర్ల: టీడీపీ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు ఈ నెల 7న సత్తుపల్లిలో నిర్వహిస్తున్నట్లు పార్టీ ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు కూరపాటి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల కన్వీనర్ తాతా సుధాకర్‌రావు తెలిపారు. సత్తుపల్లి, కొణిజర్ల మండలాల్లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సత్తుపల్లి మాధురి ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 7న ఉదయం 10 గంటలకు మొదలయ్యే మినీ మహానాడులో టీడీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈమేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో సత్తుపల్లి కోఆర్డినేటర్ బొంతు శ్రీనివాసరావు, నాయకులు మోరంపూడి రవి, వడ్డం విజయ్‌కుమార్, గుత్తా సీతయ్య, కంచర్ల వెంకటేశ్వరరావు, నాయుడు రామకోటేశ్వరరావు, ముప్పిడి శ్యామ్ సుధాకర్, వల్లపూడి వేణు పాల్గొన్నారు.


వరుస చోరీలతో బెంబేలు

మధిర: మండలంలోని తొర్లపాడులో ఇటీవల వరుస చోరీలు జరుగుతుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక కుడుముల వెంకట్రామిరెడ్డికి పొలంలో భద్రపర్చిన ట్రాక్టర్ బ్యాటరీ, తేళ్ల అశోక్ కోళ్ల ఫారంలో ఉన్న విద్యుత్ మోటారును గురువారం రాత్రి దుండగులు చోరీ చేశారు. గతంలో కాసి బోయిన శ్రీనివాసరావు, షేక్ బడే సాహెబ్ పొలాల వద్ద విద్యుత్ మోటార్లను ఎత్తుకెళ్లడంతో బాధితులు శుక్రవారం మధిర రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మధిర: మండలంలోని కృష్ణాపురం గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మోటార్ సైకిల్‌పై భార్యాభర్తలు ఇద్దరు కల్లూరు వైపు వెళ్లాల్సి ఉండగా దారితప్పి వైరా వైపు వెళ్తున్నారు. తరువాత గమనించి వెనుకకు తిరిగే క్రమంలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి పక్కనే ఉన్న కల్వర్టును ఢీ కొట్టారు. దీంతో ఆ దంపతులకు గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ఓ ప్రైవేట్ బ్యాంకు సిబ్బంది వారిని గమనించి మోటార్ సైకిల్‌పై ఎక్కించుకొని మధిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గర్భిణులకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డాక్టర్ పుష్పలత

ఎర్రుపాలెం: గ్రామాల్లోని ఆశా కార్యకర్తలు గర్భిణులకు తగిన అవగాహన కల్పించాలని డాక్టర్లు వీరబాబు, పుష్పలత సూచించారు. శుక్రవారం మండలంలోని బనిగండ్లపాడు పీహెచ్‌సీలో నిర్వహించిన ఆశాడే సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రాణి, పద్మావతి, లతాశ్రీ, సుధాకర్, సాయిరెడ్డి, శకుంతల తదితరులు ఉన్నారు.

8న ఎంపీడీఓ కార్యాలయం ముట్టడి

మధిర: ఉపాధిహామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 8న మధిర ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తేలప్రోలు రాధాకృష్ణ తెలిపారు. శుక్రవారం మండలంలోని మహదేవపురం, ఇల్లూరు గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీ డబ్బులు తక్షణమే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మధు, శేఖర్, లత, లలిత, మరియమ్మ, కల్పన, ఈశ్వర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారి కల్యాణం



చింతకాని: స్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న వేద పండితులు



మీనవోలులో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు రాము

చింతకాని: మండలంలోని మత్కేపల్లి గ్రామం తుమ్మలమ్మ చెరువు గట్టుపై వేంచేసి ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో స్వామివారి కల్యాణాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు గోపాల కృష్ణమాచార్యులు స్వామికి ప్రత్యేక పూజలతో పాటు కల్యాణ క్రతువు నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. మండలంలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతకాని, నాగులవంచ సర్పంచ్‌లు బండి సుభద్ర, ఆలస్యం నాగమణి, దేవాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ సభ్యులు చంద్రయ్య, మల్లయ్య, రామారావు, ఆలయ అర్చకులు పణిహారం శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి..

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని అర్చకుడు కాశావజుల రాము శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా వైశాఖ మాసంలో స్వామివారి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ.. కావున నలుగురు పుణ్యదంపతుల చేత స్వామివారి కల్యాణాన్ని అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణ వేడుకను భక్తులు కన్నులపండువగా తిలకించారు. స్వామి కల్యాణ విశిష్టతను అర్చకుడు భక్తులకు వివరించారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మానవతారాయ్‌పై ఫిర్యాదు

వేంసూరు: ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్‌పై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. ఈమేరకు బీఆర్‌ఎస్ సోషల్ మీడియా విభాగం ప్రతినిధి వినుకొండ శ్రీనివాసరావు శుక్రవారం వేంసూరులో పోలీసులకు ఫిర్యాదు చేసి మాట్లాడారు. చట్టబద్ధంగా ఎన్నికైన ఎమ్మెల్యే సండ్రపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మానవతారాయ్‌పై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ పగట్ల వెంకటేశ్వరరావు, సర్పంచ్ షైబుద్దీన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాల వెంకటరెడ్డితో పాటు కొండపల్లి రాంబాబు, కంటే వెంకటేశ్వరరావు, రాయల సత్యం, కందుకూరి వెంకటేశ్వరస్వామి తదితరులు పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో పోరాడాలి

కారేపల్లి: అమరుల స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికై పోరాడుదామని సీపీఎం జిల్లా నాయకుడు భూక్యా వీరభద్రం నాయక్ అన్నారు. శుక్రవారం కారేపల్లి మండలం నానునగర్‌తండా గ్రామంలో భూక్యా బావ్‌సింగ్ నాయక్ మొదటి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భూక్యా బావ్‌సింగ్ నాయక్ స్తూపం వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు సైదులు నాయక్, నరేందర్, రవి, కిషన్, సరవయ్య, వీరస్వామి, శోభన్, బ్రహ్మయ్య, పుల్లయ్య, బాబు, సంతు, హరి, చందర్, సైదులు, శ్రీను, హుస్సేన్ పాల్గొన్నారు.

సమ్మక్క - సారక్క గద్దెల ప్రతిష్ఠాపన



పోలంపల్లిలో సమ్మక్క సారక్క గద్దెలను ప్రతిష్ఠిస్తున్న గ్రామస్తులు

కారేపల్లి: మండలంలోని పోలంపల్లి గ్రామంలో సమ్మక్క సారక్క గద్దెలను గ్రామ ప్రజలు శుక్రవారం ప్రతిష్ఠించారు. మేళ తాళాల నడుమ, తెలంగాణ సాంస్కృతిక నృత్యాలు చేస్తు.. గద్దెలను ఊరేగింపుగా తీసుకొచ్చి.. ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్ఠించారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు జర్పుల దోని, ధరావత్ రాంసింగ్, ఠాకూర్, బాల, వెంకటాచారి, గణేష్, నవీన్, జతిన్, వీరు, గోపా, నాను, రేణుక, విజయ, మీనా, భద్రి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్, సొసైటీ డైరెక్టర్ రోశయ్య, భూక్యా రాంకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మానవతారాయ్

పెనుబల్లి: ఈ నెల 8న హైదరాబాద్‌లో ఎల్బీనగర్ సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న సంఘర్షన బహిరంగ సభను విజయవంతం చేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్ అన్నారు. శుక్రవారం వీఎంబంజర్‌లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకురాలు కృష్ణవేణి గృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ హాజరుఅవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కౌన్సిల్ సెక్రటరీ రావి నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు కృష్ణవేణి, కాంతారావు, ఏడుకొండలు, ప్రసాద్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా యాత్రను జయప్రదం చేయాలి

మధిర: అకాల వర్షాలతో నష్టపోయిన అన్నదాతలను ఆదుకోవాలని ఈ నెల 6న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేపట్టనున్న రైతు భరోసా యాత్రను జయప్రదం చేయాలని డాక్టర్ కోటా రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులను ఆదుకోవడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందన్నారు. రైతులకు అండగా నిలిచేందుకు పొంగులేటి శీనన్న చేపట్టిన యాత్రకు రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.